సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 21 । జూలై । 2023



నేతన్నకు భరోసా

వైఎస్సార్ నేతన్న నేస్తంతో చేనేత కార్మికులకు ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పిస్తోంది. నేడు ఐదో విడత నిధులు విడుదల చేయనున్నారు. 8లో ▸



డ్రగ్స్ సరఫరాకు అడ్డుకట్ట

ఏలూరు రేంజ్ పరిధిలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అడ్డుకట్టకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని డీఐజీ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. 8లో ▸



కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పెదపాడు పోలీసులు సీజ్ చేశారు. కొత్తూరు నుంచి తరలిస్తున్నారనే సమాచారం మేరకు వాహనాన్ని సీజ్ చేశారు.

న్యూస్‌రీల్

ఆచంటలోనే ఉంటా



వెలగలవారిపాలెం గ్రామ సభలో మాట్లాడుతున్న చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: ఇటీవల మార్టేరులో జరిగిన టీడీపీ సభ చూసి తాను ఆచంట వదిలి పారిపోతానని ప్రతిపక్ష నాయకుడు ప్రచారం చేస్తున్నారని.. నియోజవర్గంలోని అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని మాజీ మంత్రి ఆచంట శాసన సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు గురువారం జరిగిన సురక్ష గ్రామ సభలలో స్పష్టం చేశారు. తాను ఆచంటలో ప్రజలతోనే ఉంటానన్నారు. నాడు రాజశేఖరరెడ్డి పాలనలో అత్తిలి ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు ఏవిధంగా ఆదరించారో నేడు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆచంట నియోజకవర్గ ప్రజలు అంతకంటే మిన్నగా ఆదరిస్తున్నారని, వారు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముకానివ్వనని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆచంట నియోజకవర్గం నుంచే పోటీచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా కులమతాలకు అతీతంగా ఆచంట నియోజకవర్గాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అభివృద్ధి పథం వైపు నడిపిస్తానన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో అర్హత కలిగిన 9, 10, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీసీ, ఈబీసీ సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు పీఎం యశస్వి ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి జి.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆగస్టు 10 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలు మించరాదన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సెప్టెంబర్ 29న ప్రవేశపరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తుందన్నారు.

ఏలూరు నుంచి విశాఖకు ఆర్టీసీ బస్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు పరిసర ప్రాంతల ప్రజల సౌకర్యార్థం ఏలూరు డిపో నుంచి విశాఖపట్నానికి ఉదయం పూట బస్సు సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బీ వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు కొత్త బస్టాండు నుంచి ఈ సూపర్ లగ్జరీ బస్సు 4880 సర్వీస్ నెంబర్‌తో ఉదయం 10 గంటలకు బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందన్నారు. తిరిగి మరుసటి రోజు ఉదయం సర్వీస్ నెంబర్ 4881గా విశాఖపట్నం నుంచి ఉదయం 8.45 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.45 గంటలకు ఏలూరు చేరుకుంటుందన్నారు. ఈ బస్సుకు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు.

గోదావరికి వరద

- పోలవరం నుంచి 6.33 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల
- వేలేరుపాడులో 19 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- మూడు పునరావాస కేంద్రాల ఏర్పాటు
- రేషన్ పంపిణీ, వైద్యశిబిరాల ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమయ్యాకి మొదటిసారి గోదావరికి వరద పోటెత్తింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి పొంగి పొర్లుతుంది. పోలవరం స్పిల్‌వే నుంచి దిగువకు 6.33 లక్షల క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. మరోవైపు వేలేరుపాడు మండలంలో 19 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గోదావరి ఉధృతికి వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం రెండు మండలాల్లో పునరావాస కేంద్రాలు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయి.

ఎగువ రాష్ట్రాల్లో గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణ, మహరాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి పొంగి పొర్లుతుంది. కాళేశ్వరం నుంచి భద్రాచలం మీదుగా దిగువన ఉన్న పోలవరానికి భారీగా వరద నీరు చేరుతుంది. భద్రాచలంలో 43.60 అడుగుల మేర నీరు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 9,60,541 క్యూసెక్కుల నీరు పోలవరానికి విడుదల చేశారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి పోలవరంలో 32 మీటర్ల నీటి మట్టం ఉండగా.. 6,33,474 క్యూసెక్కులు ధవళేశ్వరానికి విడుదల చేశారు. పోలవరంలో 48 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చే స్తున్నారు. వరద ఉధృతి మరో 48 గంటలు పాటు కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది.



వేలేరుపాడు: ఎడ్లెలవాగు వంతెన వద్ద పడవలో గోదావరి దాటుతున్న గిరిజనులు



వేలేరుపాడు: ఎద్దులవాగు వంతెన వద్ద వరద పరిస్థితి తెలుసుకుంటున్న జేసీ లావణ్యవేణి



వేలేరుపాడు: సురక్షిత ప్రాంతానికి తరలివెళ్తున్న రేపాకగొమ్ము గ్రామస్తులు

విద్యుత్ శాఖ అప్రమత్తం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గోదావరి వరద హెచ్చరిక నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేసినట్లు ఆ శాఖ ఎస్‌ఈ పీ సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో 9440902926 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే కంట్రోల్ రూంకు గానీ 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు గాని ఫోన్ చేయాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు టౌన్: భారీ వర్షం హెచ్చరికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి తెలిపారు. వాగులు, వంకలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లోని ప్రజలు పురాతన భవనాలు, కూలిపోయే స్థితిలోని ఇళ్లలో ఉండరాదని హెచ్చరించారు.

కంట్రోల్ రూంల ఏర్పాటు

ఏలూరు(మెట్రో): బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు పశ్చిమగోదావరి జిల్లాలో 4.6 మి.మి వర్షపాతం నమోదు కాగా, ఏలూరు జిల్లాలో 15.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఏలూరు జిల్లాలో వేలేరుపాడు మండలంలో 82.82 మి.మి వర్షపాతం నమోదైంది. పశ్చిమ గోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం మండలంలో అత్యధికంగా 22.8 మి.మి వర్షపాతం నమోదు కాగా, 10 మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. వర్షాలు, వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయంలో 9553220254 నెంబరుతో కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో 7013128597, 9848590546 నెంబర్లతో, వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో 6309254781 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

అప్రమత్తమైన యంత్రాంగం

గోదావరి వరద నేపథ్యంలో ఏలూరు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఏలూరు కలెక్టరేట్‌లో 1800-233-1077 టోల్‌ఫ్రీ నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. వేలేరుపాడు మండలంలో జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి క్షేత్రస్థాయిలో పర్యటించి వరద పరిస్థితిని పరిశీలించారు. మండలంలో 19 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడులోని రేపాకగొమ్ముకు చెందిన 400 కుటుంబాలు కుక్కునూరులోని దాచారం ఆర్‌అండ్‌ఆర్ పునరావాస కాలనీకి చేరాయి. భూదేవిపేట, శివకాశీపురంలో శుక్రవారం నుంచి పునరావాస శిబిరాలు ప్రారంభం కానున్నాయి. పునరావాస శిబిరాల్లో నిత్యావసర సరకులతో పాటు కూరగాయలు పంపిణీ చేయనున్నారు. మందుల నిల్వలు అందుబాటులో ఉంచి మూడు క్యాంపుల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. వేలేరుపాడు మండలం యడవల్లి, గొల్లపల్లి మధ్య ఎద్దువాగు ఉధృతంగా పొంగుతుంది. వేలేరుపాడు మండలంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశించారు. వరద ముంపు గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా గర్భిణులను తరలించారు. కుక్కునూరు మండలంలో కిన్నెరసాని, గుండేటి వాగు, పాలవాగులో వరద నీరు చేరింది. కుక్కునూరు మీదుగా దాచారం, వేలేరుపాడు వెళ్ళే రహదారులకు వంతెన మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పాలవాగులోకి వరద నీరు చేరడంతో ఎర్రబోరు, ముత్యాలంపాడు రహదారిపైకి నీరు చేరింది. గొమ్ముగూడెం గ్రామంలోని 253 కుటుంబాలను దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పునరావాస శిబిరాలకు తరలించారు.

అది దొంగల బస్సు యాత్ర

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: రాష్ట్రం మొత్తం గంజాయి సరఫరా, రంగురాళ్లు, లాటరైట్ దోపిడీ చేసి నేడు దొంగ బస్సుయాత్రలో వచ్చి టీడీపీ నేత కొవ్వెక్కినట్లు మాట్లాడాడని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. పెంటపాడులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం బస్సుయాత్ర ముగింపు సభలో ఆ పార్టీ నాయకులు అవాకులు, చెవాకులు పేలారని ధ్వజమెత్తారు. అది దొంగల బస్సుయాత్రని విమర్శించారు. సభలో కనీసం మహిళలు ఉన్నారన్న జ్ఞానం లేకుండా పచ్చి బూతులు మాట్లాడిన ఆ దొంగకు తల్లిదండ్రులు సంస్కారం నేర్పలేదన్నారు. పచ్చిబూతులు మాట్లాడిన ఆ వ్యక్తి గంజాయి వ్యాపారం, రంగురాళ్లు, లాటరైట్ దోపిడీ చేసి వందల కోట్లు దోచేశాడన్నారు. మరో దొంగ వందల కోట్ల విలువైన అగ్రిగోల్డ్ ఆస్తులను అక్రమంగా కాజేశాడని మంత్రి కొట్టు ఆరోపించారు. ఇసుక దందాలో వందల కోట్లు దోచేశారన్నారు. స్థానికంగా ఒక బిచ్చగాడు ఉన్నాడంటూ స్థానిక నేతపైనా మంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. స్థలాలు కబ్జా చేసి భవంతులు నిర్మించి అక్రమంగా ఆర్జిస్తున్నాడన్నారు. ఎంతో అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి వారిది కాదన్నారు. గతంలో అధికారం అడ్డుపెట్టుకొని వందల కోట్లు దోచేశారన్నారు. టీడీపీకి రాష్ట్రంలో స్థానం లేదని.. ఆ పార్టీ నాయకుడు హైదరాబాద్‌లో ఉంటూ చుట్టం చూపుగా రాష్ట్రానికి వస్తాడన్నారు. చంద్రబాబు, లోకేష్ పాదాలు క్షుద్రపాదాలని, వారు ఎక్కడ అడుగుపెడితే అక్కడ నాశనమే.. అని కొట్టు అన్నారు.

ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే

- నేటి నుంచి నెల **రోజుల పాటు నిర్వహణ**
- అక్టోబర్ 17న **ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన**



భీమవరం(ప్రకాశం చౌక్): **ఓటర్ల జాబితా సవరణ**లో భాగంగా ఈ నెల 21 **నుంచి వచ్చే నెల** 21 వరకూ బూత్ లెవెల్ **అధికారులు ఇం**టింటికీ వెళ్లి సర్వే చేయను**న్నారు. సర్వేలో** భాగంగా 18 ఏళ్ల నిండిన **ప్రతి ఒక్కరికి** ఓటు హక్కు నమోదు **చేస్తారు. వచ్చే** జనవరి 1 నాటికి 18 ఏళ్లు **నిండేవారికి** కూడా ఓట్లు నమోదు **చేస్తారు.** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా **ఓటర్ల** జాబితా సవరణపై బూత్ **లెవల్** అధికారులకు ఇప్పటికే **శిక్షణ** తరగతులు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఓటర్ల **జాబితా సంక్షిప్త సవరణ** పర్యవేక్షణకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. వీరికి ఆయా మండల తహసీల్దార్లు సహాయ ఎన్నికల అధికారులు సహకారం అందిస్తారు. ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు సైతం అవగాహన కల్పించింది. తాజా లెక్కల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లాలో 14,42,471 మంది ఓటర్లు ఉన్నారు.

సర్వేలో పరిశీలించే అంశాలివీ..

- ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్ల గుర్తింపు
- చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, వంద సంవత్సరాల వయస్సు పైబడిన వారి గుర్తింపు
- **డోర్ నంబర్లు లేకుండా ఉన్నా, ఒకే డోర్ నెంబరులో పదుల సంఖ్యలో ఉన్న ఓట్లపై క్షేత్ర స్థాయి పరిశీలన**
- **జిల్లాలో కొత్తగా ఏర్పాటైన జగనన్న కాలనీలకు** పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉంటే కొత్తగా ఆయా ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సిఫార్సులు. దగ్గరలో పోలింగ్ కేంద్రాలుంటే వాటిల్లో ఆయా కాలనీల్లోని ఓట్ల విలీనం.
- సర్వీసు ఓటర్లు (మిలటరీ), ఎన్‌ఆర్‌ఐ ఓట్ల వివరాలను సరిచేయడం
- దీర్ఘ కాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను గుర్తించి ఎన్నికల నియమావళి ప్రకారం సవరణ
- ఒక బూత్‌లో సరాసరి 1,500కు పైగా ఓట్లు ఉంటే కొత్త బూత్ ఏర్పాటుకు సిఫారసు. అందుకు అనువైన ప్రదేశాల గుర్తింపు.
- పేర్లు, నియోజకవర్గాలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, ఫొటో గుర్తింపు కార్డుల్లో మార్పులు, చేర్పులు, తప్పొప్పులు సరి చేయడం
- ఓటర్ల అభ్యర్థన మేరకు పోలింగ్ కేంద్రాలు, ఓట్లు ఒక చోటు నుంచి మరో చోటుకు మార్చడం.

'పశ్చిమ'లో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్లు
భీమవరం	2,48,594
పాలకొల్లు	1,92,286
ఉండి	2,21,285
నర్సాపురం	1,63,346
తణుకు	2,31,984
ఆచంట	1,76,839
తాడేపల్లిగూడెం	2,08,137

పారదర్శకంగా తయారీ



జిల్లాలో ఓటర్ల జాబితా సవరణను అత్యంత హేతుబద్ధంగా చేపడుతున్నాం. పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు తీసుకుంటున్నాం. పది మందికి పైగా ఓటర్లు ఉన్న ఇళ్లను క్షేత్ర స్థాయిలో ఆయా మండలాల తహసీల్దార్లు స్వయంగా పరిశీలిస్తారు. 18 ఏళ్లు నిండిన యువకులందరికీ ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశాం. జిల్లాలో ఈఆర్‌వోలుగా నియోజకవర్గానికి ఒకరు చొప్పున అధికారులను నియమించాం.

– పి.ప్రశాంతి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

సర్వే షెడ్యూలు

ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకూ బూత్ లెవెల్ అధికారుల సర్వే. వచ్చే నెల 22 నుంచి సెప్టెంబర్ 29 వరకూ పోలింగ్ స్టేషన్ల సర్దుబాటు, విభజన. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు 1,500 ఓట్లు ఉండేలా సర్దుబాటు. ఎక్కువ, తక్కువ ఉంటే సమీప పోలింగ్ స్టేషన్లలో కలపడం

- గుర్తింపు కార్డులు, జాబితాల్లోని తప్పుల సవరణ
- స్పష్టత లేని ఫొటోలు తొలగించి, మంచి ఫొటోల ఏర్పాటు. అనంతరం ఎన్నికల కమిషన్ ఆమోదానికి పంపడం..
- సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకూ ఫాం-1 నుంచి 8 వరకూ పరిశీలన. అదనంగా పెరిగిన, తగ్గిన ఓటర్ల జాబితాల తయారీ
- అక్టోబర్ 17న ముసాయిదా జాబితా ప్రకటన
- దీనిపై అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణ.
- రెండు ఆదివారాలు, రెండు శనివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం.
- ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయింలు డిసెంబర్ 26వ తేదీ నాటికి పరిష్కరించడం.
- వచ్చే ఏడాది జనవరి 1న సిద్ధం చేసిన ఓటర్ల జాబితాను ఆమోదానికి పంపించడం. జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రకటన.

పేదలకు ఆరోగ్య భద్రత

- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో మందులు ఫుల్
- ఐరన్ లోపం, బీపీ, సుగర్‌తోపాటు 172 రకాల మందులు రెడీ
- పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలకు కొత్త మందుల స్టాక్





ఏలూరు యూపీహెచ్‌సీలో ర్యాక్‌లో వివిధ రకాల మందులు.. కొత్తగా వచ్చిన మందులు

ఏలూరు టౌన్: పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. మూడంచెల వైద్య సేవలను అందుబాటులోకి తేవడంతో పేదల ఆరోగ్యానికి భరోసా వచ్చింది. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో భాగంగా ఇంటివద్దకే వైద్యులను పంపుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో తెచ్చిన విప్లవాత్మక మార్పుల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించేవారు. ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలతో పాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి.

మెరుగైన వైద్య సేవలు

ఏలూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) ఉండగా, అర్బన్ ప్రాంతాల్లో 14 యూపీహెచ్‌సీలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. గతంతో పోల్చుకుంటే గ్రామాలు దాటి చిన్నపాటి జ్వరానికి సైతం మండల, జిల్లా కేంద్రాలకు పరుగెట్టే పరిస్థితి తగ్గింది. 104 సంచార వైద్యశాలల్లో వైద్యులు గ్రామానికి నెలకు రెండుసార్లు వస్తూ మందులు ఇచ్చి వెళుతున్నారు. రక్తహీనతకు సంబంధించి 6 ఏళ్ళలోపు వారికి పింక్, 10 నుంచి 19ఏళ్ళ లోపు వారికి బ్లూ కలర్, ఆపై వయసు వారికి రెడ్ కలర్‌లో ఉండే మాత్రలు ఇస్తున్నారు. చిన్నపిల్లలకు 45 ఎంజీ, యువత, పెద్దలకు 150 ఎంజీ మోతాదులో బిళ్ళలు ఇస్తున్నారు. రక్తపోటుకు సంబంధించి నాలుగు రకాల మాత్రలు అందుబాటులో ఉన్నాయి. సుగర్, గుండె సంబంధిత వ్యాధులకు ఆస్ప్రిన్, కొలెస్ట్రాల్ మందులు ఉన్నాయి. ఎక్కడైనా పీహెచ్‌సీలో కొరత ఏర్పడితే వెంటనే ఇతర పీహెచ్‌సీల నుంచి సర్దుబాటు చేస్తున్నారు.

172 రకాల మందులు..

ఏలూరు సంతోష్‌నగర్‌లో యూపీహెచ్‌సీలో వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీయగా.. ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టమైంది. రూ.80లక్షలతో నిర్మించిన ఈ యూపీహెచ్‌సీలో సకల సౌకర్యాలతో పాటు రోగులకు అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి కొరత లేదని ఫార్మసిస్ట్, ఆరోగ్య సిబ్బంది, వైద్యాధికారి తెలిపారు. యూపీహెచ్‌సీలో సుమారు 172 రకాల మాత్రలు అందుబాటులో ఉన్నాయి.

- బీపీకి సంబంధించి నాలుగు రకాలు
- గుండెకు సంబంధించి యాస్ప్రిన్, కొలెస్ట్రాల్ అదుపులో ఉంచే మందులు
- సుగర్కు, బలానికి, విటమిన్-సీ, గ్యాస్ నొప్పి, నులిపురుగులకు, తలతిరుగుడు సమస్యకు యాంటీ బయాటిక్స్, ఆయాసం, వాంతులు, జలుబు, జ్వరం, విరేచనాలకు మందులు అందుబాటులో ఉన్నాయి
- చిన్న పిల్లల వ్యాధులకు మందులు, ఫంగల్ ఇన్ఫెక్షన్స్ మందులు ఉన్నాయి.
- పలు రకాల ఇంజెక్షన్లు, సెలైన్స్, టానిక్‌లు అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో కొత్త మందుల స్టాక్



ఆస్పత్రికి వచ్చే రోగులకు మందుల కొరత లేదు. బీపీ, సుగర్, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి రోగులకు నెలకు సరిపడా మందులు ఇస్తుంటాం. బీపీకి నాలుగు రకాల మాత్రలు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా వివిధ రకాల మందుల స్టాక్ వచ్చింది. ప్రతీ రోజూ ఓపీకి వచ్చే ప్రజలకు వైద్య పరీక్షలు చేయటం, వారికి అవసరమైన మందులు ఇస్తుంటాం. తీవ్రమైన అనారోగ్యం ఉన్నట్లు గుర్తిస్తే ఏలూరు జీజీహెచ్‌కు రిఫర్ చేస్తాం.

– డాక్టర్ స్వప్న, వైద్యాధికారి, యూపీహెచ్‌సీ, ఏలూరు

జిల్లాలో మందుల కొరత లేదు



ఏలూరు జిల్లా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యూపీహెచ్‌సీల్లో ఏలాంటి మందుల కొరత లేదు. మూడు నెలలకు ముందుగానే ఆయా పీహెచ్‌సీలకు కావాల్సిన మందుల అవసరాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం. పీహెచ్‌సీలకు సకాలంలోనే మందులు సరఫరా అవుతున్నాయి. బీపీ బిళ్ళలు, బలానికి ఇచ్చే ఐరన్ ఫోలిక్ మాత్రల కొరత లేదు. స్టాక్ అయిపోతే ఎక్కువ ఓపీ ఉండే పీహెచ్‌సీలకు వేరే చోట్ల నుంచి సర్దుబాటు చేస్తూ ఉంటాం.

– డాక్టర్ దయాల ఆశ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఏలూరు

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు కృషి



కేంద్ర బృందం సభ్యుడికి ప్రణాళికలు వివరిస్తున్న డీపీఓ

భీమడోలు: భీమడోలుకు జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డు సాధన లక్ష్యంగా పని చేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. భీమడోలులో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ కేంద్ర బృందం సభ్యుడు గుత్తికొండ నాగేంద్ర, అధికారులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్ని సందర్శించారు. జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుకు జిల్లాలో భీమడోలు, దొరమామిడి ఎంపిక చేశారని అవార్డు సాధించేందుకు తీసుకుంటున్న ప్రణాళికలను కేంద్ర బృందం సభ్యుడికి డీపీవో వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించారు.

క్లుప్తంగా

ఈ-బైక్ ప్రతినిధులకు ఫోరం జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు శ్యామల, బొబ్బిలి బంగారయ్య

ఆకివీడు: కొనుగోలు చేసిన ఏడాదికే ఈ–బైక్ మరమ్మతులకు గురై మూలన పడినా స్పందించని సంబంధిత కంపెనీ ప్రతినిధులు బాధితురాలికి రూ.69 వేలు నగదు చెల్లించాలని, ఫిర్యాదు చేసిన తేదీ నుంచి 9 శాతం వడ్డీ చెల్లిస్తూ, రూ. 5 వేలు ఖర్చుల నిమిత్తం చెల్లించాలని ఏలూరు జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్ డి.కోందడరామమూర్తి, సభ్యులు ఎస్.సురేష్ కుమార్, లక్ష్మీ తీర్పు ఇచ్చినట్లు గురువారం బాధితురాలు శ్యామల, వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య చెప్పారు. స్థానిక విలేకరులకు గురువారం వారు మాట్లాడారు. కాళ్ల మండలం ఏలూరుపాడు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న రాసాబత్తుల శ్యామల ప్రస్తుతం గణపవరం ప్రభుత్వ పాఠశాలలోని జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలుగా పని చేస్తున్నారు. ఏలూరుపాడు పాఠశాలలో పనిచేస్తుండగా ఏలూరులోని గుడా ఈ–బైక్ షోరూమ్‌లో 34 నెలల క్రితం ఈ–బైక్ కొనుగోలు చేశారు. ఏడాది లోపే బైక్ మరమ్మతులకు గురైంది. షోరూమ్ చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా బండిని బాగు చేసి ఇవ్వలేదు. దీంతో ఆమె జిల్లా వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య సలహా మేరకు లాయర్ భీమేశ్వరరావును సంప్రదించి డీలర్‌పై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. వాదోప వాదాలు విన్న అనంతరం ఫోరం చైర్మన్ డీ.కోందడ రామమూర్తి, సభ్యులు ఎస్.సురేష్ కుమార్, లక్ష్మీలు తీర్పు ఇస్తూ బాధితురాలికి రూ. 69 వేలు నగదు చెల్లించాలని తీర్పు ఇచ్చారన్నారు.

నేతన్నకు భరోసా

- నేడు ఐదో విడత నిధులు జమ
- పశ్చిమలో 1,027 మందికి రూ.2.46 కోట్ల మేర లబ్ధి
- ఏలూరు జిల్లాలో 162 మందికి రూ.38.88 లక్షల ప్రయోజనం



మగ్గంపై చీర నేస్తున్న చేనేత కార్మికురాలు

ఏలూరు (టూటౌన్): ప్రజా సంకల్ప యాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని చేనేత కార్మికుల దుస్థితిని కళ్లారా చూసి చలించిపోయారు. వారికి అండగా నిలిచేందుకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంతో ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారు. నేడు ఐదో విడత నేతన్న నేస్తం పథకం నిధులు విడుదల చేయనున్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారంటూ చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని సంపాదనతో ఇల్లు గడవడమే కష్టంగా మారిన తమ కుటుంబాల్లో ఒక భరోసా కల్పించారని చేనేత కార్మికులు చెబుతున్నారు.

వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం పట్ల ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని చేనేత కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రోజంతా కష్టపడినా రూ.100 నుంచి రూ.200 వరకూ వస్తుందని, వచ్చే ఆదాయంతోనే తమ కుటుంబాలు జీవనం సాగించాల్సిన దుస్థితి ఉండేదని, నేడు దానికి భిన్నంగా నెలకు రూ.2 వేలు వంతున ఒకేసారి రూ.24 వేల ఆర్థిక సాయం చేయడం వల్ల తమకు కొండంత అండ దొరికిందని చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐదో విడత నేతన్న నేస్తం పథకం నిధుల విడుదలతో ఒక్కో చేనేతకార్మికునికి మొత్తం రూ.1.20 లక్షల మేర లబ్ధి చేకూరనుంది. చేనేత కుటుంబాలలో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

నాలుగు విడతల్లో రూ.8.55 కోట్లు అందజేత

నేతన్న నేస్తం పథకం ప్రారంభించిన నాటి నుంచి ఇంతవరకూ నాలుగు విడతల్లో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల పరిధిలో మొత్తం రూ.8.55 కోట్లు ప్రభుత్వం అందజేసింది. ఐదో విడతలో రెండు జిల్లాల్లో కలిపి మరో రూ.2.85 కోట్ల నిధులు అందజేయనున్నారు.

గత నాలుగు విడతల్లో ఏలూరు, పశ్చిమలో లబ్ధిదారుల వివరాలు

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన మొత్తం (రూ.లలో)
2019–20	854	204.96 లక్షలు
2020–21	1,067	256.08 లక్షలు
2021–22	779	186.96 లక్షలు
2022–23	864	207.36 లక్షలు

పశ్చిమలో 1027 మందికి లబ్ధి

వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా పశ్చిమగోదావరి జిల్లాలో సొంత మగ్గాలు ఉండి చేనేతపై ఆధారపడి జీవిస్తున్న 1027 మందికి ఐదో విడత నిధులు జమ కానున్నాయి. దీంతో రూ.2,46,48,000ల లబ్ధి చేకూరనుంది. గతంలో గిట్టుబాటు కాక నేతను వదిలి ఇతర పనులకు వెళ్ళిన వారు సైతం ప్రభుత్వ నిర్ణయంతో తిరిగి చేనేత రంగం వైపు వస్తున్నారంటూ పలువురు మాస్టర్ వీవర్స్ చెబుతున్నారు.

ఏలూరు జిల్లాలో 162 మందికి రూ.38.88 లక్షలు లబ్ధి

ఏలూరు జిల్లాలో 162 మంది లబ్ధిదారులకు ఐదో విడతలో రూ.38.88 లక్షల మేరకు లబ్ధి చేకూరనుంది. జిల్లాల పునర్విభజనతో ఏలూరు జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. ఏలూరు జిల్లా పరిధిలో ఏలూరు రూరల్‌లో 8 మంది, ఏలూరు అర్బన్‌లో 5 మంది, కైకలూరులో 40 మంది, ముదినేపల్లిలో 107 మంది, పెదవేగి, కలిదిండిలో ఒక్కొక్కరు చొప్పున లబ్ధిదారులు ఉన్నారు.

కష్టకాలంలో ఆదుకున్నారు



రోజంతా పనిచేసినా కుటుంబ పోషణ గడవని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన నేతన్న నేస్తం పథకం ఎంతో ఆదుకుంది. మా కష్టానికి తోడు ప్రభుత్వం అందిస్తున్న నెలకు రూ.2 వేలు ఎంతో ఉపయోగపడింది. ఒకేసారి రూ.24 వేలు నేరుగా మా ఖాతాల్లో వేయడం ఎంతో మేలు చేసింది.

– పడాల నాగరాజు, లబ్ధిదారుడు, శనివారపుపేట, ఏలూరు

మళ్లీ వృత్తికి చేరువయ్యాం



చాలీ చాలని రాబడితో చేనేత వృత్తిని వదిలేసి వేరే పనులు చేసుకుందామనుకున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన నేతన్న నేస్తం పథకం ద్వారా ఆదుకున్నారు. దూరమవుదామనుకున్న వృత్తికి చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. నాడు పాదయాత్రలో మాట ఇచ్చిన విధంగానే చేనేత కార్మికులను ఆదుకున్నారు.

– పేరక వెంకటేశ్వరరావు, నేతన్న నేస్తం లబ్ధిదారుడు, ఏలూరు

కష్టాలకు ఊరట



వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకంలో ఒక్కో చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.24 వేలు అందించడం ద్వారా చేనేత కార్మికులు పడుతున్న కష్టాలకు ఊరట చేకూరింది. చేనేత కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. సొంత మగ్గాలు ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం పథకం వర్తింప చేయడం అభినందనీయం.

– కొల్లిపాక సురేష్ కుమార్, ఏలూరు నగర అధ్యక్షుడు, వైఎస్ఆర్ చేనేత విభాగం

ప్రభుత్వ సాయం మరువలేనిది



రోజు రోజుకు క్షీణించిపోతున్న చేనేత కార్మికుల బతుకుల్లో నేతన్న నేస్తం వెలుగులు నింపింది. నేత కార్మికులకు ప్రభుత్వం చేస్తున్న సాయం మరువలేనిది. మాస్టర్ వీవర్స్ వద్ద పనిచేసే సొంత మగ్గాలు లేని చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం అమలు చేయాలి. చేనేతపై విధించిన జీఎస్టీని పూర్తిగా తొలగించి ఆదుకోవాలి.

– పిచ్చుక ఆదిశేషు, జిల్లా కార్యదర్శి, ఏపీ చేనేత కార్మిక సంఘం

ట్రిపుల్ ఐటీలో ఆడిటోరియం ప్రారంభం



ఆడిటోరియం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో రూ.88 లక్షలతో ఆధునికీకరించిన ఏసీ ఆడిటోరియంను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వసతులతో అందుబాటులోకి వచ్చిన ఆడిటోరియం సెమినార్‌లు, కాన్ఫరెన్స్‌లు, వర్క్‌షాపులు తదితర విద్యా సంబంధిత సమావేశాలు నిర్వహించుకోవడానికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో ఆధునిక వసతులను కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ఏవో ప్రదీప్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య కే వియన్నారావు తదితరులు పాల్గొన్నారు.

'భవిష్యత్ విద్య' పుస్తకం ఆవిష్కరణ

నూజివీడు: విద్యావ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఉన్నత విద్యను దేశాభివృద్ధిలో ఒక కీలక అంశంగా ప్రభుత్వాలు భావిస్తున్నాయని ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ వియన్నారావు రచించిన 'భవిష్యత్ విద్య' పుస్తకాన్ని గురువారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పుస్తకంలో అన్ని అంశాలూ ఉన్నాయని, విద్యావేత్తలకు, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారన్నారు. ఉన్నత విద్యారంగంలోని నిపుణులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్‌లో విద్య లక్ష్యం, స్వభావం, ప్రాథమ్యాలు, పాఠ్యాంశాల్లో వచ్చే మార్పులు, అల్గోరిథం, కృత్రిమ మేధ తదితర అంశాలపై విపులంగా చర్చించారన్నారు. ఆచార్య కోదాటి వియన్నారావు, డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, పరిశోధన విభాగాధిపతి ఆచార్య జీ మోహన్‌రావు, అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు పాల్గొన్నారు.

పంట బోదెలో యువకుడి అనుమానాస్పద మృతి



పంట బోదెలో పడి ఉన్న కార్తికేయ మృతదేహం, కార్తికేయ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: ఆరుళ్లలో ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని పంట బోదెలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపిన వివరాలు ప్రకారం కొయ్యలగూడెంకు చెందిన కర్రి దామోదర కార్తికేయ వీరవెంకటసత్యనారాయణ (21) నిడదవోలులోని ఒక ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 18న పరీక్ష నిమిత్తం నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెంకు బైక్‌పై వస్తుండగా, ప్రమాదవశాత్తు ఆరుళ్లలో కల్వర్టు వద్ద చెట్టును ఢీకొని బైక్‌తో పాటు పంట బోదెలో పడిపోయాడు. పంట బోదె నుంచి దుర్వాసన రావడంతో గురువారం రూరల్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉద్యాన విద్యార్థికి అమెరికా వర్సిటీలో సీటు



విద్యార్థిని మేఘనను అభినందిస్తున్న వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో బీఎస్సీ ఆనర్స్ హార్టీకల్చర్ చదివిన నల్లగారి లక్ష్మీ మేఘన ఎమ్మెస్ ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికాలోని వెస్టు వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలో ప్రవేశం పొందింది. బీఎస్సీ ఆనర్సు హార్టీకల్చర్‌లో 80 శాతం మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. సంవత్సరానికి పన్నెండువేల డాలర్ల స్టయిఫండ్‌తో 2023 ఆగస్టు నుంచి 2025 మే వరకు అమెరికాలో బయోటెక్నాలజీలో ఎంఎస్ చదవనుంది. మేఘనను గురువారం వెంకట్రామన్నగూడెం వర్సిటీ వీసీ కార్యాలయంలో ఉపకులపతి టి.జానకీరామ్ అభినందించారు. వర్సిటీ అధికారులు బి.శ్రీనివాసులు, డీవీ స్వామి ఉన్నారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు : పెంటపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణ

'ఈనాడు'లో అసత్య కథనాలు దుర్మార్గం

విలేకరుల సమావేశంలో మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్



తణుకులో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ సుధాకర్, డీఈఈ ఈశ్వరరెడ్డి

తణుకు అర్బన్: 'వర్షాకాలంలో చలివేంద్రాలు' అనే శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనం పూర్తి అవాస్తవమని మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అన్నారు. తణుకు మునిసిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వేసవి ప్రారంభం కాగానే తణుకు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో రెండు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు చలివేంద్రాల నిర్వహణకు రూ.4.17 లక్షలు నిధులతో టెండరు పిలిచామని, అయితే కారుమూరి సేవాసమితి, స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో పురపాలక సంఘ పరిధిలోని ప్రధాన రహదారుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో తిరిగి ఆ టెండరును రద్దు చేసినట్లు చెప్పారు. మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ దీనిపై ఈనెల 14న ఈనాడు పత్రిక విలేకరి వివరాలు కోరగా చలివేంద్రాలపై టెండరు పిలిచిన మాట వాస్తవమేనని, దీని నిమిత్తం ఎవరికీ డబ్బులు చెల్లింపులు జరపలేదని, టెండరును సైతం రద్దు చేసినట్లు చెప్పామన్నారు. అయినప్పటికీ మునిసిపల్ నిదులు దుర్వినియోగం అయినట్లు గుసగుసలు ఉన్నాయంటూ ఈనెల 19న కథనం ప్రచురించడం ఎంతవరకు సబబని నిలదీశారు. సదరు విలేకరి అడిగిన తీరు కూడా వివాదాస్పదంగా ఉందని ఆరోపించారు. రూ.5 లక్షల వరకు పనులను నామినేటెడ్ పద్ధతిలో కాంట్రాక్టరుకు అప్పగించే సౌకర్యం ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారం ఇ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలిచామన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసే తమపై ఇటువంటి అసత్య కథనాలు రాయడం దుర్మార్గమని అన్నారు. ఏఈ రామకిషోర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణా నిరోధించాలి

ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్ : ఏలూరు రేంజ్ పరిధిలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిరోధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని, నిందితులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా శ్రద్ధ చూపాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి గురువారం ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేస్తూ కేసుల్లో నిందితులకు కచ్చితంగా శిక్షలు విధిస్తేనే భయం వస్తుందని, చట్టాలపై గౌరవం ఏర్పడుతుందనే ప్రభుత్వ ఉద్దేశాన్ని అమలు చేసేలా పోలీస్ అధికారులు కేసులపై చొరవ చూపాలని డీఐజీ చెప్పారు. ఆయా కేసుల్లో తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గతంలో ఎస్‌డీపీఎస్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేసిన క్రాంతి ప్రసాద్, ప్రముఖ న్యాయవాది సూర్యనారాయణతో ప్రస్తుతం మారుతున్న చట్టాలకు అనుగుణంగా నేరస్తులపై ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, శిక్షలు పడేలా చార్జిషీట్ల దాఖలు వంటి అంశాలపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, కాకినాడ ఎస్పీ సతీష్‌కుమార్, అంబేడ్కర్ కోనసీమ ఎస్పీ శ్రీధర్, తూర్పుగోదావరి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి, పశ్చిమగోదావరి ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా, ఏలూరు జిల్లా ఎస్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, న్యాయ సలహాదారు కే.గోపాలకృష్ణ, డీసీఆర్‌బీ సిబ్బంది ఉన్నారు.

బీపీటీకి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ



పెనుమంట్ర: మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో బీపీటీ 5204 వరి రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1271 రకాన్ని రూపొందించి విడుదల చేయడం జరిగిందని పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ ఎం.భరత్‌లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సాగుచేసే వరి రకాలలో బీపీటీ 5204 ప్రధానమైందని, ఈ రకాన్ని సుమారు 3.50 లక్షల హెక్టార్లలో సాగు చేస్తున్నారన్నారు. కానీ ఈరకం చీడపీడలు, ముఖ్యంగా దోమపోటు, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులును పూర్తిగా తట్టుకోలేని కారణంగా సరైన దిగుబడులు రాడంలేదని, ఈ రకానికి ప్రత్యామ్నాయంగా మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఎంటీయూ రైస్ 1271 రకాన్ని రూపొందించామన్నారు. ఈ రకాన్ని ఈ నెల 18, 19 తేదీలలో జరిగిన రాష్ట్ర రకాల విడుదల కమిటీ ద్వారా దీనిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ రకం సార్వాకు అనుకూలమైనదని, పంటకాలం 140 రోజులు , రెండు వారాల నిద్రావస్థ కలిగి గింజరాలిక తక్కువగా ఉంటుందన్నారు. చీడపీడలను తట్టుకుని 69.7 శాతం బియ్యం దిగుబడి ఇస్తుందన్నారు. కాండం దృఢంగా ఉండి, చేను పడిపోదని, గింజ మధ్యస్థ సన్నంగా ఉంటుందని, పచ్చిబియ్యానికి అనుకూలంగా ఉంటుందన్నారు. సగటున హెక్టారుకి 6.5 నుండి 7.0 టన్నుల దిగుబడి సామర్థ్యం కలిగి ఉంటుందని, ఈరకాన్ని రాష్ట్ర రకాల విడుదల కమిటీ సమావేశంలో అందరి ఆమోదం పొంది మార్టేరు పరిశోధనా స్థానానికి గర్వకారణంగా నిలిచిందన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

ఏలూరు టౌన్: గుడివాకలంక గ్రామం పరిధిలోని చేపల చెరువులో గుర్తు తెలియని ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఏలూరు రూరల్ ఎస్ఐ లక్ష్మణబాబు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లేత అకుపచ్చ, నీలం రంగు గడుల చీర ధరించి ఉందని, వయస్సు 60 నుంచి 65 సంవత్సరాలు మధ్య ఉండవచ్చన్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చ్యురీకి తరలించామన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు తన సెల్ నంబర్ 94407 96636, ఏలూరు వన్ టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ సెల్ నెంబర్ 94407 96604కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ

అధికారులతో సమీక్షలో పశ్చిమ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ఓటర్ల జాబితా రూపకల్పనలో ఈఆర్‌ఓలు కీలకపాత్ర వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం రాత్రి జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తో కలిసి ఈఆర్వోలు, ఎన్నికల డీటీలతో ఓటర్ల జాబితా రూపకల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జూలై 21 నుంచి చేపట్టే ఓటర్ల జాబితా పరిశీలనలో బీఎల్‌ఓలకు ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సమగ్ర ఓటరు సర్వేకు రంగం సిద్ధం చేయాలన్నారు. పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ జరిగినప్పుడు ఎన్నికలు సజావుగా జరుగుతాయని, గత అనుభవాలు జోడించి పనిచేయాలన్నారు. అర్హత ఉన్న వారికి ఓటుహక్కు కల్పించాలని, అదే విధంగా మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను ఇంటింటా సర్వేలో నమోదు చేయాలన్నారు. ఈ సర్వేలో గ్రామ, వార్డు వలంటీర్లు పాల్గొనరని ఆమె స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు స్వీకరించిన వివరాలను ప్రతి మంగళవారం నియోజకవర్గ స్థాయిలో, ప్రతి బుధవారం జిల్లా స్థాయిలో పరిశీలిస్తామన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపు అంశాలపై ఏమైనా సమస్యలుంటే బుధవారం చర్చించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన ప్రతి ఒక్క ఓటరును ఓటరు జాబితాలో కచ్చితంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా చక్కని ఓటర్ల జాబితా రూపొందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టరు సూచించారు. డీఆర్వో కె.కృష్ణ వేణి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్డీవో దాసి రాజు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

దోష రహిత ఓటర్ల జాబితా రూపొందించడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు సహ కరించాలని జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై జూలై 21 నుంచి చేపట్టనున్న ఓటర్లు జాబితా సచ్ఛీకరణపై చర్చించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నేతల సందేహాలను నివృత్తి చేశారు. ఇంటింటికీ బీఎల్‌ఓలు ఓటర్ల జాబితా పరిశీలనకు వెళ్ళిన సమయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అనుసరించవచ్చని, ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. బూత్ ఏజెంట్లకు తప్పనిసరిగా ఆయా ప్రాంతాలలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 1,454 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, పురుష ఓటర్లు 7,07,411 మంది, స్త్రీ ఓటర్లు 7,34,959 మంది, థర్డ్ జెండర్స్ 101 మంది మొత్తం 14,42,471 మంది ఓటర్లు ఉన్నారన్నారు. డీఆర్వో కె.కృష్ణ వేణి, డీఆర్వో దాసి రాజు, తణుకు ఈఆర్వో, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం ఇఆర్వో, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్, ఆచంట ఇఆర్వో, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.ఆదిశేషు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బీజేపీ నుంచి చెరుకూరి వెంకట కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ నుంచి కె.నాగేశ్వరరావు, టీడీపీ నుంచి మరపట్ల శ్యాంబాబు, సీపీఐ నుంచి కోనాల భీమారావు, సీపీఎం నుంచి జేఎస్‌పీ గోపాలం పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారుణ్య కేర్‌లో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం కారుణ్య చిన్నారుల ఆశ్రమంలో గురువారం దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనేత కొట్టు విశాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమం నిర్వహణకు సహాయ, సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని కొట్టు విశాల్ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌ఛార్జ్ సిస్టర్ లస్సీ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్, నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి ఆదినారాయణ (చుక్కయ్య), ఎమ్పీటీసీ కవులూరి సుబ్బలక్ష్మి, తారమట్ల శ్రీనివాస్, ప్రత్తి రంగయ్య, విద్యార్థి విభాగం అధ్యక్షుడు బండారు నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడెంలో నేడు వైఎస్సార్‌సీపీ సేవాదళ్ సమావేశం

పెంటపాడు: గూడెం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సేవాదళ్ సమావేశం శుక్రవారం గూడెంలోని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంప్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పెంటపాడు మండల సేవాదళ్ కన్వీనర్ సంపదరావు కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించబోయే ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రీజినల్ కమిటీ చైర్మన్ చినిమిల్లి వెంకట్రాయుడు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గ కార్యకర్తలు సేవాదళ్ సభ్యులు విధిగా హాజరు కావాలన్నారు.

టీబీఆర్‌లో వైఎస్సార్ కంటి వెలుగు

పెంటపాడు: అలంపురం టీబీఆర్ సైనిక స్కూల్లో విద్యార్థులకు గురువారం వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. సంస్థ చైర్మన్ తనబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. గ్రామీణ ఆరోగ్య అధికారి లావణ్య ఆధ్వర్యంలో సిబ్బంది విద్యార్థులకు కంటిపరీక్షలు చేశారు. కంటి సమస్యలు ఉన్నవారికి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 300 మందికి కంటి పరీక్షలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వన్ టౌన్ పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్, హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 21వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. పీ అండ్ టీ కాలనీ, మహాలక్ష్మినగర్, హౌసింగ్‌బోర్డు పరిధిలో మెయిన్ రోడ్డు ఫీడర్లకు సంబంధించి విద్యుత్ మరమ్మతులు జరుగుతాయని, విద్యుత్ లైన్‌లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేసేందుకు గాను విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. మసీద్ రోడ్డు, వివేకానంద బొమ్మ సెంటర్, ఝాన్సీరాణి ఆసుపత్రి, ఎన్టీఆర్ సర్కిల్ ఏరియాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గూడెంలో 22.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ,పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 22.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ గురువారం తెలిపారు. పెంటపాడు మండలంలో 9.2 మిల్లీ మీటర్లుగా వర్షపాతం నమోదైందన్నారు.

వేగంగా తాడేరు వంతెన నిర్మాణ పనులు



తాడేరు వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: భీమవరం శివారులోని గునుపూడి సౌత్ డ్రెయిన్‌పై తాడేరు వంతెన నిర్మాణ పనులు వేగంగా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. 2019లో శిథిలావస్థకు చేరిన వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిషేధించామన్నారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రూ.1.90 కోట్లు నిధులు మంజూరు చేయించామన్నారు. ఆ సమయంలో కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వంతెన నిర్మాణ అంచనాలను రూ.2.30 కోట్లుకు పెంచి నిధులు మంజూరు చేయించినట్టు చెప్పారు.

'సురక్ష'తో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్



తణుకు అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో మహిళకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, కారుమూరి సునీల్‌కుమార్

తణుకు అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ నూరుశాతం సంక్షేమ పథకాలు అందించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తెలిపారు. తణుకు 28, 29, 30 వార్డుల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పేదవర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నారని అన్నారు. 11 రకాల సేవలకు సంబంధించి ధ్రువపత్రాలను ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా ఈ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్నారని స్పష్టం చేశారు. యువనేత కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ అర్హులెవ్వరూ కూడా అనర్హులుగా మిగిలిపోకూడదనే ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయ వ్యవస్థను ప్రతి గడపలోకి పంపిస్తున్నారని అన్నారు. వివిధ ధ్రువపత్రాలు అవసరమైన వారికి ముందుగా టోకెన్‌లు అందచేసి వారికి ధ్రువపత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణఅధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నాయకులు మారిశెట్టి శివశంకర్, గుడిమెట్ల సూర్యనారాయణరెడ్డి, శెట్టి శాంతకుమారి, ఝాన్సీ లారెన్స్, అడ్డగర్ల శివబాబు, బొల్లాడ శ్రీను, ఎస్.చంద్రశేఖర్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజలకు మేలు

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులందరికీ సంక్షేమం అందించాలనే ఉద్ధేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. గురువారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం, జగ్గన్నపేట గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో జరిగిన సభలో ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని ఎంతో మంది ప్రజలు ఉన్నారన్నారు. వారందరికీ న్యాయం చేయడం కోసం ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, సర్పంచ్‌లు మర్లపాటి వీర వెంకటసుబ్బలక్ష్మి, ములకాల సూర్యారావు, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, ఉద్యాన శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, పంచాయతీ ఈవో ఆర్వీ.బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శులు పి.సారిక, బి.బాలకృష్ణ, నాయకులు ములకాల రాంబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు

అత్తిలి: జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వ సేవలు మరింత దగ్గరయ్యాయని యువనేత కారుమూరి సునీల్‌కుమార్ చెప్పారు. గురువారం అత్తిలి మండలం తిరుపతిపురం, కంచుమర్రు గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. తిరుపతిపురంలో జరిగిన సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కాసూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఎంపీటీసీ సభ్యుడు పి నాగేంద్ర శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఆయా గ్రామపార్టీ అధ్యక్షులు పంపన సత్యనారాయణ, పెన్మెత్స భాస్కర వెంకటపతిరాజు, తెలి సుందరరావు,గౌరవ అధ్యక్షుడు వడ్డి రామచంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గవర నాగన్న, కంకిపాటి రత్నరాజు, కొడమంచిలి దొరబాబు, పంపన సత్యనారాయణ, రంభ సూరిబాబు, శీలబోయిన రామకృష్ణ, నిల్లా బాలవీరయ్య, శలా కుమారస్వామి, వాసా రుద్రయ్య, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష నిరుపేదలకు రక్ష

తాడేపల్లిగూడెం అర్బన్ : జగనన్న సురక్ష నిరుపేదలకు రక్షగా నిలిచిందని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని 25, 26, 27 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శామ్యూల్, నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి దసారి సావిత్రి, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, మునిసిపల్ ఇంజినీర్ మురళీకృష్ణ, కర్రి భాస్కరరా వు, గుండుబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, చింతకాయల సత్యనారాయణ, విజయారెడ్డి, పచ్చి పాల శివశంకర్, గురజాడ బ్రహ్మాజి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) జీవీకే మల్లికార్జునరావు తెలిపారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం పెంటపాడు-1, రాచర్ల గ్రామాల్లో రెండు టీంల ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకొని తక్షణం అక్కడి కక్కడే సంబంధిత వ్యక్తులకు ధ్రువపత్రాలు అందించారు. రెండు గ్రామాల్లో తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీల అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వాకా దుర్గా భవాని, తాడేపల్లి సూర్యకళ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, చింతన శారద, మాజీ సర్పంచ్‌లు డోకుల కమలాకర్, పెంటపాడు ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ బీసీ సంఘ నాయకులు వాకా వెంకటసుబ్బారావు, కాసారపు శ్రీను, ఆయా గ్రామాల వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, టీం సభ్యులు, వాలంటీర్లు, గృహసారదులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష

ఇరగవరం: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, కారుమూరి సునీల్ కుమార్ అన్నారు. గురువారం ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్ రామాయణం జగదీష్, సొసైటి అధ్యక్షుడు సైపురెడ్డి పెద్దిరాజు, మామిడిశెట్టి శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెంటపాడు: రాచర్ల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారునికి ధ్రువపత్రం అందజేస్తున్న డీపీవో మల్లికార్జునరావు, తహసీల్దార్ తదితరులు



తాడేపల్లిగూడెం రూరల్: మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో విశ్వనాథ్

19 ఏళ్ల తర్వాత స్థలానికి పట్టా



గ్రామంలో 2004వ సంవత్సరంలో ఇంటి స్థలం ఇచ్చారు. అప్పట్నించి ఇప్పటి వరకు పట్టా ఇచ్చిన దాఖలాలు లేవు. జగనన్న దయ వల్ల నేడు పట్టా తీసుకున్నాం. దాదాపు 19 ఏళ్ల తర్వాత ఇంటి పట్టా వచ్చింది. ఎంతో సంతోషంగా ఉంది.

– చినమర్తి దుర్గ, మెట్ట ఉప్పరగూడెం, తాడేపల్లిగూడెం మండలం

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



గత 19 ఏళ్లుగా ఇంటి స్థలం ఉన్నా ఇల్లు నిర్మించుకోలేకపోయాం. ఇప్పటి వరకు పూరిగుడిసెల్లోనే జీవనం సాగిస్తూ వచ్చాం. పట్టా ఇవ్వడంతో త్వరలోనే ఇంటిని నిర్మించుకుంటాం. జగనన్న సురక్షలో పట్టా ఇవ్వడం పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– కామంచి ముత్యాలు, మెట్ట ఉప్పరగూడెం, తాడేపల్లిగూడెం మండలం

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- పెంటపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



పెంటపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణ

పెంటపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేదల అభ్యున్నతికి దోహదపడుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పెంటపాడు మండలంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ పాదయాత్రలో చెప్పిన రీతిగానే నూరు శాతం హామీలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని, ఆయన ఉన్నంత వరకు రాష్ట్రాభివృద్ధికి ఏ ఢోకా లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం జగనన్న అందించిన పథకాలు ప్రజలకు వివరించే సమయంలో లబ్ధిదారుల మోములో ఎంతో సంతోషం కనిపిస్తోందన్నారు. ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలు అధికారం కోసం వైఎస్సార్ పార్టీపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నికలలో ప్రజలు చంద్రబాబుకు బుద్దిచెప్పినా నేడు జగసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను వెనుకాల పెట్టి ఎన్నికలకు రావడం విచారమన్నారు. ఈ సారి ప్రజలు టీడీపీని మరింత దిగజార్చి డిపాజిట్లు లేకుండా చేయడం ఖాయమన్నారు. ప్రజలు అభివృద్ధి చేసే వ్యక్తికే పట్టం కడతారన్నారు. వచ్చే ఎన్నికలలో జగనన్నకు భారీ మెజార్టీ చేకూర్చి గెలిపించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ గ్రామ వాసులను కోరారు. ముందుగా పోస్టు బేసిక్ స్కూల్ వెనుక నూతనంగా వేసిన సిమ్మెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ఎంపీపీ దాసరి హైమావతి, పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు కర్రి వరహాలరెడ్డి, కర్రి లక్ష్మిప్రియాంక గుండుమోగుల సాంబయ్య, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల బాబి, ఎంపీటీసీ సభ్యురాలు దేవాబత్తుల నాగమణి, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, పార్టీ నాయకులు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, మైలవరపు పెదబాబు, సొసైటీల అధ్యక్షుడు బూరాడ శ్రీనివాస్, దేవ వెంకటరమణ, ములగాల రామసత్యనారాయణ, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, పరిమెళ్ల గ్రామ సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, బోడపాడు సర్పంచ్ గేదల శివకుమార్, విజ్జరోతు పెద్దిరాజు, చల్లా లింగమూర్తి, చల్లా కుమారస్వామి, పార్టీ యూత్ అధ్యక్షుడు బాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయ్ ఆనంద్‌రెడ్డి, దాట్ల రామలింగరాజు, కిరణ్‌రాజు, వింజమూరి శ్రీనివాస్, దాసరి ప్రవీణ, ఆయా శాఖల అధికారులు, పార్టీ నాయకులు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి వెంకటేశ్వరరావు

తణుకు టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికలు సిబ్బంది ఇప్పటి నుంచే సిద్ధం కావాలని తణుకు నియోజకవర్గ ఎన్నికల అధికారి జెడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21వ తేదీ నుంచి అగష్టు 21 వరకూ బూత్ లెవిల్ అధికారులు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారని చెప్పారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్‌లను నియమించుకుని ఆ జాబితాలను తమకు అందించాలని కోరారు. వచ్చే సంవత్సరం జనవరి 24 నాటికి తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేసేలా కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎన్నికల డీటీ సూర్యనారాయరాజు, అత్తిలి, ఇరగవరం మండలాలకు చెందిన తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లతో పాటు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్‌లతో పాటు టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజాదరణ చూసి ఓర్వలేకే విమర్శలు

- చంద్రబాబు, పవన్‌ల కుట్రలు
- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ప్రతి కుటుంబానికీ మేలు చేయాలనే సదుద్దేశంతో పథకాలు రచించి అమలు చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో వస్తోన్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆరోపించారు. భీమవరం మండలం శ్రీరామపురం, వెంప గ్రామాల్లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ 98 శాతం హామీలు చేసి ప్రతి కుటుంబానికి రూ.50 వేలు నుంచి రూ.5 లక్షలు వరకు లబ్ధి చేకూర్చారని వివరించారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏనాడు పేదలకు మేలు చేయలేదన్నారు. 2014 ఎన్నికల్లో నెరవేరని 600 హామీలను ఇచ్చి తీరా ఓట్లేశాక అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. ఫలితంగా 2019లో చంద్రబాబును 23 సీట్లకే పరిమితం చేశారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 151 సీట్లిచ్చి ఘన విజయం చేకూర్చారని తెలిపారు. ఈ సందర్భంగా వెంపలో 2,645, శ్రీరామపురంలో 1,058 ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగు నరసింహరావు, ఉభయ గోదావరి జిల్లాల సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకట్రాయుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, ఎంపీడీఓ కె. వెంకటలక్ష్మి, సర్పంచ్ కలిదిండి సుజాత, గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్ కలిదిండి ఫణిరాజు, సీనియర్ నాయకులు అల్లూరి కృష్ణంరాజు, త్రి సభ్య కమిటీ చైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు, అప్పలరాజు, రామచంద్రరాజు, దాట్ల శ్రీనివాసరాజు, బలరామరాజు, సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి, ఎంపీటీసీలు చిలకపాటి కుమారి, పెన్మెత్స సాయిలక్ష్మి, భాగ్యానందం, కొండేటి లక్ష్మయ్య, సానబోయిన బాపూజీ, సత్యనారాయణ, తిరుమాని పెద్దిరాజు, యేసురత్నం, పెచ్చెట్టి రాము, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, నామన మహేష్, కొట్టి కుటుంబరావు, కార్యదర్శి జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



ఆరుగొలనులో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొన్న డీపీవో మల్లిఖార్జునరావు

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే.మల్లిఖార్జునరావు అన్నారు. గురువారం మండలంలోని ఆరుగొలను సచివాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్-2023పై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీపీవో మల్లిఖార్జునరావు మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా చెత్తా, చెదారాలను రోడ్లపై వేయకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి, చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకుండా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కలిగించాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాల్సిన బాధ్యత పంచాయతీ, సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం ఆరుగొలను, కొత్తూరు గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, డీపీఆర్సీ టీమ్ సభ్యులు దినేష్ ఎడ్వర్డ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస చంద్రరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



రిలే దీక్షల్లో పాల్గొన్న మునిసిపల్ కార్మికులు, యూనియన్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లుకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) పట్టణ కార్మికులు ఆధ్వర్యంలో గురువారం రిలే దీక్షలు జరిగాయి. జిల్లా అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి ధనాల దానయ్యలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీ ఆందోళనలో భాగంగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో రిలే దీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. హెల్త్ అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ రిలే దీక్షల్లో కె.బాబు, కె.దయామణి, బి.గంగ, కె.సుమలత, కె.సార తదితర కార్మికులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సలాం



తాడేపల్లిగూడెం రూరల్: ప్రస్తుత సమాజంలో కన్నబిడ్డలే కన్న వారిని చూడని పరిస్థితి. అటువంటిది రాష్ట్రంలోని మహిళలను వలంటీర్లు తల్లిదండ్రులుగా చూసుకుంటున్నారు. రుణమాఫీ, వైఎస్సార్ చేయూత, పింఛన్, 35 కిలోలు బియ్యం ఉచితంగా అందజేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లోనూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

– ప్రత్తిపాటి సోమాలు, వీరంపాలెం, తాడేపల్లిగూడెం మండలం

సేవలు వెలకట్టలేం



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్, సచివాలయ వ్యవ స్థ ద్వారా ప్రభుత్వం నుంచి తమకు వచ్చే పథకాలు నేరు గా ఇంటి వద్దనే లబ్ధి చేకూరుస్తున్నారు. మా వలంటీర్ సేవలు వెలకట్టలేనివి. ఆమెద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.